నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 9 జూన్ 2025 | MAHABUBNAGAR NARAYANPET

మాగంటి మృతి తీరని లోటు

హైదరాబాద్‌లో మాగంటి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- నివాళులర్పించిన మాజీ ఎంపీ రావుల, మాజీ ఎమ్మెల్యే గువ్వల, మర్రి, బీరంతోపాటు బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్/అచ్చంపేట/నాగర్‌కర్నూల్/కొల్లాపూర్ రూరల్, జూన్ 8 : జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ సింగిరెడ్డి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. తన సహచరుడు, మృదుస్వభావి గోపినాథ్ జూబ్లి హిల్స్ ఎమ్మెల్యేగా ప్రజలకు ఎన్నో సేవలందించారని మాజీ మంత్రి గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేల నివాళి..

జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ పార్థివదేహానికి మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పూలమాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను, కుమారుడిని ఆయన ఓదార్చారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాలమరణం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు పేర్కొన్నారు. ఆయన మరణంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాగంటి మృతి పార్టీకి తీరనిలోటని, ఎంతో కష్టపడి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన మాగంటి ఎంతో సౌమ్యుడిగా ప్రజానేతగా పేరు సంపాదించారని తెలిపారు. అనంతరం మాగంటి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అకాల మృతి బాధాకరమని, పార్టీకి తీరని లోటని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందడంపై మర్రి దిగ్భ్రాంతికి గురయ్యారు. మూడు సార్లు జూబ్లీ హిల్స్ నుంచి శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహించి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ తన నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషిచేసినట్లు తెలిపారు.జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాగంటి ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపినాథ్ మృదుస్వభావి, మంచి వ్యక్తి అని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆయన సేవలను కొనియాడారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి...

జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మృతి పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి స్వగృహంలో గోపినాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ మాట్లాడుతూ గోపినాథ్ స్వయంకృషితో అంచెలంచెలుగా రాజకీయంలో ఎదిగారని, కేసీఆర్ నాయకత్వంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది అభివృద్ధిలో భాగస్వామి అయ్యారన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న నాయకుడు అకాల మరణం చెందడం ఎంతో దురదృష్టకరమని ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్, నాగన్నయాదవ్, గులాం ఖాదర్ ఖాన్, స్టార్ రహీం, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము, సాధిక్, అలీం, ఏకే పాషా తదితరులు ఉన్నారు.

పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

మద్యంతాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు..

వాహనదారులు ఎట్టిపరిస్థితుల్లో మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.. జైలుకు పంపిస్తాం. మద్యం తాగడం చట్టం ప్రకారం నేరం. ఇలా తాగి వాహనాలు నడపడం వలన చాలా వరకు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో కుటుంబాలు సైతం ఇబ్బందులు పడతాయి. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి న్యాయ స్థానాలు జరిమానాలు విధించడం తోపాటు జైలు శిక్షలు విధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విస్తృతంగా తని ఖీలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నాం.

– డీ జానకి, ఎస్సీ, మహబూబ్‌నగర్ జిల్లా

పేటలో బ్రీత్ అనలైజర్‌తో తనిఖీ చేస్తున్న ఏఎస్సై(ఫైల్)



మద్యం తాగి వాహనం నడిపితే.. జైలుకే..

- మందు బాబులకు జైలు శిక్షలతోపాటు జరిమానా
- విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు
- ఐదు నెలల్లో రూ. 15లక్షల జరిమానా, 1239 మందిపై కేసులు

మహబూబ్‌నగర్, జూన్ 8 : ఒక్కటే బీరు తాగినా.. రెండు పెగ్గుల మందే తాగాను.. ఇంత శాతం ఎలా వచ్చింది ? అంత రాకూడదు అసలు ఇది సాధారణంగా మద్యం తాగి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడిన వారి మధ్య సాగే చర్చ. కానీ వాహనదారుల రక్త నమూనాల్లో 30 మిల్లీ గ్రాముల మద్యం మోతాదు దాటితే కేసు నమోదవుతుంది. శారీరకంగా బలంగా ఉంటే ఒకరకంగా.. బలహీనంగా ఉంటే మరోరకంగా ఎంజీలు నమోదవుతుంటాయి. ఇది తెలియకుండా కొంతమంది వాహనదారులు కొద్దిగానే తాగాం కదా అని వాహనాలు నడిపి పోలీసుల చేతికి చిక్కుతున్నారు. తాగి పట్టుబడే వారి విషయంలో న్యాయస్థానాలు సైతం కఠిన వైఖరి అవలంభిస్తున్నాయి. జైలు శిక్షలు విధిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ విస్తృతంగా తనిఖీలను నిర్వహిస్తోంది. ప్రధానంగా జిల్లా కేంద్రం తోపాటు ప్రధాన పట్టణాల్లో తనిఖీ సాగుతున్నాయి. జాతీయ రహదారి పొడవునా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి సమయాల్లో మద్యం తాగి ఎక్కువ మంది వాహనాలు నడుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదాలు సైతం అదే సమయంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గతేడాది జిల్లా వ్యాప్తంగా 1239 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరికి న్యాయ స్థానం రూ.27,14,300 జరిమానాలు విధించగా 9 మందికి జైలు శిక్షలు సైతం విధించారు. ఈ ఏడాది మరింత విస్తృతంగా అధికారులు తనిఖీలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 1239 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా రూ.15, 15,200 జరిమానాలు విధించింగా, ఆరుగురిని జైలుకు తరలించారు.

న్యాయస్థానాల కఠిన వైఖరి..

మద్యం తాగి వాహనాలు నడిపే విషయంలో న్యాయస్థానాలు సైతం కఠిన వైఖరిని అవలంభిస్తున్నాయి. మనిషి రక్తనమూనాల్లో 30 మిల్లీ గ్రాముల మద్యం మెతాదు నమోదయిందంటే చాలు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇంతకు మించి నమోదైన వారికి జరిమానాల తోపాటు జైలు శిక్షలు విధిస్తున్నారు. ఇప్పటి వరకు విధించిన శిక్షలో రెండు నుంచి పదిరోజుల వరకు మద్యం బాబులకు జైలు శిక్షలు విధించారు. దీంతోపాటు రూ. 2100 నుంచి రూ. 2,500 వరకు మద్యం మోతాదుకు బట్టి జరిమానా వేస్తున్నారు. అయితే కొందరు మొదటిసారి పొరపాటు జరిగిందని మరోమారు ఇలాంటి పొరపాటు చేయమని పైకోర్టులకు వెళ్లినా ఇదే శిక్షను అమలు చేస్తూ తీర్పులను వెలువరించారు. మొత్తంగా జిల్లాలోని న్యాయ స్థానాలు సైతం డ్రంకెన్ డ్రైవ్ విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తున్నాయి. వాహనదారుల్లో మార్పులు రాక పోతే మాత్రం జైలు జీవితాలు గడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి.

30 ఎంజీ/100 ఎంఎల్

ట్రాఫిక్ తనిఖీ సమయంలో 30 ఎంజీ/100 ఎంఎల్‌నే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. తక్కువ వస్తే పోలీసు అధికారులు జరిమానాలు విధించి వదిలేస్తున్నారు. బ్రీత్ ఆనలైజర్ పరీక్షలు నిర్వహించినప్పుడు 100 మిల్లీ లీటర్ల రక్తనమూనాల్లో 30మిల్లీ గ్రాముల మద్యం కంటే ఎక్కువగా ఉంటే కేసులు నమోదు చేస్తున్నారు. మద్యం తాగిన వెంటనే వాహనాలు తీసుకొని బయటికి వచ్చి పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతుండడంతో ఒక్కొక్కరికీ 40 నుంచి 210 శాతం వరకు బీఏసీ నమోదు అవుతున్నా పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి.

ఒక్క బీర్ తాగినా..

ఒక్క బీరులో సాధారణంగా 750 మిల్లీ గ్రాముల మద్యం ఉంటుంది. బీరు తాగి అదిరక్తంలో కలిసిపోతే బీఏసీ శాతం 40–50గా నమోదు అవుతుంది. బీరు తాగిన గంటలోపు డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కితే బ్రీత్ ఎనలైజర్‌కు దొరికిపోట్టే ఒకవేళ తాగిన గంట తర్వాత డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కితే బీఏసీ 30 శాతం వరకు ఉండే అవకాశం ఉంటుంది. అంటే ఒక్క బీరు తాగి బండి నడిపినా కేసు నమోదు కావడం తప్పనిసరనే విషయం వాహనాదారులు గుర్తించాలి. ఒక్క బీరు తాగితేనే ఈ పరిస్థితి ఉంది. కానీ ప్రస్తుతం యువత రెండు నుంచి ఆరు బీర్లు వరకు తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న పరిస్థితి ఉంది. జిల్లాలో నిర్వహించే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఎక్కువగా చిక్కేది దిగువ మధ్య తరగతి వారే. వీరిలో ఎక్కువ మంది చీప్ లిక్కర్ తీసుకుంటున్నారు. ఎక్కువ ధర గల మద్యం కంటే చీప్ లిక్కర్‌లో ఆల్కహాల్ శాతం అధికంగా ఉంటుంది. దీంతో శ్వాస పరీక్ష నిర్వహించినప్పుడు బీఏసీ శాతం కూడా ఎక్కువగా నమోదవుతోంది.

మనిషి సామర్థ్యం కూడా..

కొంత మంది ఎక్కువ బీర్లు.. మద్యం తాగినా ఒక్కో సారి బ్రీతింగ్ ఎనలైజర్లకు చిక్కరు. మద్యం తాగిన అందరిలో మత్తు ఒకేలా ఉండదు. శారీరకంగా బలవైన వ్యక్తి రక్తనమూనాల్లో మద్యం శాతం తక్కువగా నమోదైతే బలహీనుడి నమూనాల్లో ఎక్కువ శాతం నమోదు అవుతుంది. మద్యం తాగిన మూడు గంటల తర్వాత పరిశీలన చేస్తే నిర్ణీత పరిమితి కంటే తక్కువకు చేరుకునేందుకు అవకాశం ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు మృతి

- కొల్లూరు గేట్ వద్ద ఘటన

నవాబ్‌పేట, జూన్ 8 : ట్రాక్టర్, బైక్ ఢీ కొన్న ఘటనలో తల్లీ కొడుకు మృతిచెందిన ఘటన నవాబ్‌పేట మండలంలోని కొల్లూరు గేట్ వద్ద చోటు చేసుకున్నది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం నవాబ్‌పేట మండల కేంద్రానికి చెందిన తల్లీ కొడుకు మరికంటి లక్ష్మమ్మ(50) మరికంటి యాదగిరి(22) ఆదివారం కొందుర్గులోని బంధువుల పెండ్లికి వెళ్లారు. తిరిగి వారిద్దరు బైక్‌పై నవాబ్‌పేటకు వస్తుండగా కొల్లూరు గేట్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పిచ్చకుంట్ల శ్రీకాంత్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మమ్మ, యాదగిరి (ఫైల్)

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద

- ఇన్‌ఫ్లో 8,050 క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 250 క్యూసెక్కులు
- ప్రస్తుత నీటిమట్టం 23.154 టీఎంసీలు

అయిజ, జూన్ 8 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు టీబీ డ్యాంకు వరద కొనసాగుతోంది. ఆదివారం టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 8,050 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 250 క్యూసెక్కులుగా ఉన్నది. గరిష్ఠ నీటిమట్టం1633 అడుగులకు గానూ ప్రస్తుతం 1601.23 అడుగుల నీటి మట్టం ఉండగా, 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 23.154 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద తగ్గుముఖం పట్టింది. ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోగా, కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ ద్వారా దిగువన ఉన్న సుంకేసులకు 213 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 184 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్‌లో ప్రస్తుతం 7 అడుగుల మేర నీటిమట్టం ఉన్నది.

కర్ణాటకలోని తుంగభద్ర ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

పనులకు వెళ్తున్న బడీడు పిల్లల అడ్డగింత

- మహిళా వీవోపై ఆటో డ్రైవర్ల జులుం
- అసభ్య పదజాలంతో దూషణ, ఆపై దాడి
- ఆరగిద్ద శివారులో ఘటన

గట్టు, జూన్ 8 : కూలీ పనులకు ఆటోల్లో వెళ్తున్న బడీడు పిల్లలను అడ్డుకున్నందుకు ఓ మహిళా వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)పై ఆటో డ్రైవర్లు జులుం చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు మండలం ఆరగిద్ద శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. బాధితురాలు, స్థానికుల కథనం ప్రకారం కొంత మంది బడీడు ఆడపిల్లలు రెండు రోజుల కిందట వీవోఏ మునేశ్వరి వద్దకు వెళ్లి తమను తల్లిదండ్రులు కూలీ పనులను పంపుతున్నారని, ఈ పనులు చేయలేక శారీరకంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన వీవోఏ తమ గ్రామం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ఆటోలను గ్రామ శివారులో అడ్డుకున్నది. దీంతో ఆటోడ్రైవర్లు ఏకమై ఆమెను అసభ్య పదజాలంతో దూషించారు. మేం ఎలా బతకాలంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు. నీకూ పని లేకుంటే కూలీ పనికి రా రూ.500 వస్తాయంటూ మాట్లాడారు. అంతటితో ఆగకుండా నీ మొగుడు పొట్టి.. మీరేం చేస్తారంటూ ఆమెపై దాడిచేశారు. ఈ క్రమంలో బాధితురాలు మునేశ్వరి తనపై డ్రైవర్లు దాడి చేశారని, తన భర్తను అవహేళన చేస్తూ మాట్లాడారని చెబుతూ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా మునేశ్వరి మీడియాతో మాట్లాడుతూ వీవోఏ విధుల నిర్వహణలో రోజురోజుకూ ఇబ్బందులు పడుతున్నానని కన్నీళ్ల పర్యంతమైంది. మహిళా సంఘాల రుణాల చెల్లింపుకు వెళ్తే తనపై కుక్కను ఉసిగొల్పుతున్నారని చెప్పుకొచ్చింది.

తన భర్త పొట్టిగా ఉండడంతో ఎవరికి వారు చెప్పరాని విధంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. ఈ విషయంలో తనకు న్యాయం చేసి ఆటో డ్రైవర్లపై చర్యతీసుకోవాలని ఆమె ఉన్నతాధికారులను కోరింది.

గుప్పుమంటున్న గంజాయి

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి(ఫైల్)

- జిల్లాలో యువతే లక్ష్యంగా అమ్మకాలు
- ఖద్దరు అండతో గుట్టుగా దందా
- మత్తులో యువత వికృత చేష్టలు
- గత నెలలో గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

గద్వాల, జూన్ 8 : ఒకప్పుడు నగరాలకే పరిమితమైన గంజాయి దందా ప్రస్తుతం జిల్లాలకు పాకింది. కొందరు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఈ దందాను నగరాల నుంచి జిల్లాలకు చేర్చారు. ఈ దందా చేసే వారికి ఖద్దరు నాయకుల అభయ హస్తం అందించడంతో ప్రశాంతంగా ఉన్న నడిగడ్డ గంజాయి అడ్డగా మారింది. ఇప్పుడిప్పుడే దీని మూలాలు జిల్లాలో కనిపిస్తుండడంతో ఆదిలోనే దీనికి పోలీసులు చరమగీతం పాడితే యువత మత్తు వైపు వెళ్లకుండా ఉండే అవకాశం ఉంది. లేక పోతే జిల్లాలో గంజాయి గుప్పుమనే అవకాశాలు లేకపోలేదు. గద్వాల ప్రజలు నూడ్‌కాల్స్ వ్యవహారం మరువక ముందే, గద్వాల చెందిన వ్యక్తి నుంచి గంజాయి స్వాధీనం చేసుకోవడం జిల్లాలో కలకలం రేపుతున్నది. కొన్ని ప్రైవేట్ దవాఖానలతో పాటు టీ షాపుల వద్ద ఈ దందా జోరుగా కొనసాగుతున్నట్లు సమాచారం. దీనిని అరికట్టడానికి ఎక్సైజ్, పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ దందా మాత్రం ఆగడం లేదు. గద్వాల జిల్లా కేంద్రంలో గుప్పుమంటున్న గంజాయితో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండంతో ఇది పోలీసులకు తలనొప్పిగా మారింది. గంజాయి సేవించిన యువత ఏమి చేస్తున్నారో వారికే తెలియడం లేదు. గంజాయి దందాకు ఆదిలోనే చెక్ పెట్టకపోతే నడిగడ్డ యువతకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. గంజాయి సరఫరా చేస్తున్న, దానిని తీసుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్పా చెక్ పడే అవకాశం లేదు.

గుట్టుగా దందా..

యువతను లక్ష్యంగా చేసుకొని కొందరు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఉన్నత కుటుంబాలకు చెందిన పిల్లలు, యువతను ఎంచుకొని వారికి గుట్టుగా గంజాయి విక్రయిస్తున్నారు. దీనిని తీసుకున్న యువత మత్తులో వికృత చేష్టలు చేస్తున్నారు. గంజాయిని నేరుగా విక్రయిస్తే అనుమానం వస్తుందనే ఆలోచనతో గంజాయి దందా చేసే వారు అక్రమ మార్గాలు అనుసరిస్తున్నారు. వాస్తవంగా బహిరంగ మార్కెట్‌లో 50గ్రాముల గంజాయి రూ.400 నుంచి రూ.500వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలు చేసిన గంజాయిని సిగరెట్లలో నింపి ఒక్కో సిగరెట్ రూ.200 నుంచి రూ.300 వరకు యువతకు విక్రయించి విక్రయదారులు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. ఇలా అక్రమ దందా చేస్తూ గంజాయి విక్రయించేవారు లక్షలు సంపాదిస్తున్నట్లు సమాచారం.

మత్తులో యువత వికృత చేష్టలు..

మత్తుకు అలవాటు పడిన యువత జిల్లాలో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. గతేడాది గద్వాల మండలం శెట్టి ఆత్మకూర్‌లో యువకులు మైనర్ బాలికలను వేధించడమే కాకుండా వారి ఇండ్లకు వెళ్లి కుటుంబ సభ్యులపై దాడికి యత్నించారు. ఓ ప్రైవేట్ దవాఖానలో పని చేస్తున్న మహిళతో పాటు ఇతరులు మత్తులో ఉండి కాలనీలో గందరగోళం సృష్టించడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి వెళ్లగా వారిపై సైతం దురుసుగా ప్రవర్తించడం అప్పట్లో కలకలం రేపింది. కృష్ణా రోడ్డులో ఓ పోకిరి బ్యాచ్ వస్త్రవ్యాపారిపై దాడి చేశారు. ఇలా వెలుగులోకి వచ్చినవి సంఘటనలు కొన్ని అయితే వెలుగులోకి రాని ఘటనలు చాలా ఉన్నాయని సమాచారం.

మే 13న 680గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

జిల్లా కేంద్రంలోని కుంట వీధికి చెందిన బషీర్ కొంతకాలంగా జిల్లాలో గంజాయిని విక్రయిస్తున్నాడు. హైదరాబాద్‌లోని దూల్‌పేట నుంచి గంజాయిని తీసుకొచ్చి గద్వాల లోని యువతకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. యువతకు గంజాయి సప్లయ్ చేస్తున్నాడన్నా సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు అతని కదలికలపై నిఘా ఉంచారు. గత నెల 13వ తేదీన గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో బషీర్ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో గద్వాల పట్టణ పోలీసులకు అతనిని పట్టుకొని 680గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అతడి రిమాండుకు తరలించారు. అయితే ఆ యువకుడు జిల్లా కేంద్రంతో పాటు ఇంకా ఎక్కడక్కడ గంజాయిని విక్రయించాడనే దానిపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ దందా వెనుక ఖద్దరు నాయకులు ఉండడం వల్ల ఎవరెవరికి గంజాయి విక్రయించారో పోలీసులు బయట పెట్టనట్లు తెలుస్తోంది. యువతను చెడు దారి పట్టించే గంజాయి అమ్మకాల వెనుక ఎంతటి వారు ఉన్న పోలీసులు ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకొని గంజాయి విక్రయాలకు చెక్‌పెట్టి యువతను కాపాడాల్సిన అవసరం వారిపై ఎంతైనా ఉన్నది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు

పెబ్బేరు, జూన్ 8 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన పెబ్బేరు సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఎస్సై యుగంధర్‌రెడ్డి కథనం మేరకు ఏపీలోని నంద్యాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దాని వెనక వస్తున్న చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు లారీని ఢీకొట్టింది. ఈప్రమాదంలో బస్సు క్లీనర్ నాగేంద్రప్రసాద్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కడప జిల్లా కాజీపేట మండల బాలానగర్‌కు చెందిన వాసిగా గుర్తించారు. బస్సులోని ప్రయాణికులకు గాయాలు కాగా పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకోవడంతో జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆవు దూడపై అడవి జంతువు దాడి

ధరూర్, జూన్ 8 : ఆవు దూడపై అడవి జంతువు దాడి చేసి చంపేసిన ఘటన కొత్తపాలెం తెలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు ధరూర్ మండలంలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు రమేశ్ తన ఆవులను శనివారం పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా ఆవు దూడ కన్పించకపోవడంతో సమీప పరిసరాల్లో వెతకగా రాళ్ల గుట్ట వరకు రక్తం పడడం గుర్తించారు. ఈ క్రమంలో గుట్ట వద్ద ఆవు దూడపై అడవి జంతువు దాడి చేసి చంపేసి తిన్నట్లు ఆనవాళ్లు కనబడడంతో రైతు ఆవేదనకు గురయ్యాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో గ్రామస్తులు ఆ ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. దూడపై చిరుత దాడి చేసినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం ఫారెస్ట్ అధికారులు, పశువైద్య అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దూడ విలువ రూ.20వేలకు పైగా ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.



అయిజలో ఉల్లినారుమడికి చీరలతో కల్పించిన రక్షణ

నారుకు కోకతో కంచె..!

- వినూత్నంగా ఆలోచిస్తున్న రైతన్నలు

అయిజ, జూన్ 8 : వానకాలంలో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పంట పొలాల్లో నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. ఉల్లి, మిరప నారుమడులు పంట పొలాల్లో పోస్తున్నారు. నారుమడులను అడవి జంతువులు, కుక్కల నుంచి రక్షించుకునేందుకు రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. రైతులు పొలంలో కర్రలను పాతి చీరలను కంచెగా కడుతున్నారు. అయిజ శివారులో ఉల్లినారుమడులోకి జంతువులు రాకుండా నిరోధించేందుకు చీరలతో రైతులు రక్షణ చర్యలు చేపట్టారు.